
సాక్షి ప్రకాశం

మంగళవారం । 18 । జూన్ । 2024



## డెత్ స్పాట్స్!

పశ్చిమ ప్రకాశంలో పలు రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూలమలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

- 8లో..



## నమో నారసింహా..!

వరాహ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణ చేశారు.

- 8లో..

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.8/29.5

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా జల్లులు పడవచ్చు.

## న్యూస్‌రీల్

### నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

పెద్దారవీడు: మండలంలో గొబ్బూరు గ్రామంలో ఉయ్యాల పోలేరమ్మ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం ఒంగోలు జాతి వృషభరాజుల బలప్రదర్శన మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. మొదటి బహుమతి రూ.80 వేలు, రెండో బహుమతి రూ.60 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాల్గో బహుమతి రూ.40 వేలు, ఐదో బహుమతి రూ.30 వేలు, ఆరో బహుమతి రూ.20 వేలు, ఏడో బహుమతి రూ.10 వేలు, ఎనిమిదో బహుమతి రూ.8 వేలు గెలుపొందిన ఎద్దుల యజమానులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోలేరమ్మ అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అభిషేకం, అర్చన, గణపతి, రుద్ర, చండీ, నవగ్రహ హోమాలు, మహా పూర్ణాహుతి, మహానైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదం వినియోగం, తదితర పూజలు చేయనున్నారని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం, ఎలక్ట్రికల్ ప్రభ ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

### మంత్రి స్వామిని కలిసిన ఎస్పీ



తూర్పునాయుడుపాలెంలో మంత్రి స్వామితో ఎస్పీ

టంగుటూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, కొండపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయ స్వామిని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ సోమవారం తూర్పునాయుడుపాలెం మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపి, పలు విషయాల గురించి చర్చించారు.

# గట్టు మాటున కాటు



వర్షాకాలం వచ్చిందంటే చాలు పల్లెల్లో పాముల బెడద మొదలవుతుంది. పొలం పనులకు వెళ్లిన వారు ఎక్కువగా పాముకాటుకు గురవుతుంటారు. గతంలో పాముకాటుతో మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సౌకర్యాలు లేక, మందుల కొరతతో ప్రాణాలు కోల్పోయేవారు. కానీ గత ప్రభుత్వంలో మారుమూల ప్రాంతాలకూ వైద్యసేవలను చేరువచేయడంతో పాటు క్వాలిఫైడ్ వైద్యులను నియమించి, తగిన మందులు అందుబాటులో ఉంచడంతో సకాలంలో మెరుగైన వైద్యం అందుతోంది. ఈ సీజన్‌లోనే ఇప్పటి వరకు దాదాపు వంద మంది పాముకాటుకు గురవగా ఒక్కరికి కూడా ప్రాణాపాయం లేదు.

- వర్షాలతో పుట్టలోంచి బయటకు వస్తున్న పాములు
- పొలం గట్లపై తిరుగుతూ ప్రాణాంతకం
- జూన్ నుంచి పాముకాట్ల సీజన్ మొదలు
- పాముకాటు మరణాలను తగ్గించిన గత ప్రభుత్వ చర్యలు
- జిల్లాలో ఈ సీజన్లో ఇప్పటి వరకు వంద కేసుల నమోదు
- అన్నీ పీహెచ్‌సీల్లో అందుబాటులో స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు

ఒంగోలు టౌన్: ఇప్పటి దాకా వేసవి ఎండల వలన గుంతలు, పొదలు, గుబురుగా ఉండే చెట్ల మధ్య, గడ్డివాముల్లో తల దాచుకునే పాములు అలా వర్షాలు కురుస్తాయే లేదో బుసలు కొడుతూ బయటకు వస్తాయి. పొలం గట్ల మీద తిరుగుతుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పడగ విప్పి కాటేస్తాయి. పల్లెల్లో చింత చెట్ల మీద తాచు పాములు, నాగు పాములు, పసిరిక పాములు, కట్ల పాములు కనిపిస్తుంటాయి. పాము కాటు బాధితుల్లో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు, రైతు కూలీలే ఉండడం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో పాము కరిచినప్పుడు సాధ్యమైనంత త్వరగా వైద్యశాలకు వెళ్లే సౌకర్యం లేకపోవడంతో గతంలో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకునేవారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు సరిగా ఉండేవి కావు. ఎక్కడో ఒకటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది. అక్కడ వైద్యుడు ఉండేవారు కాదు. సిబ్బంది కూడా అంతంత మాత్రంగా ఉండేవారు. పాము కాటుకు విరుగుడు ఇంజక్షన్లు ఉండేవి కావు. 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇద్దరు క్వాలిఫైడ్ వైద్యులను నియమించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా రైతు కూలీలు పాము కాటుకు గురవుతున్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం పాము కాటు విరుగుడుకు ఉపయోగించే యాంటి వీనమ్ ఇంజక్షన్లను అందుబాటులో ఉంచింది. దీంతో ఇప్పుడు పాము కాటు వలన చనిపోయేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

**ఈ ఏడాది 100 పాముకాట్ల నమోదు:**

జూన్ నుంచి అక్టోబర్ వరకు పాముకాట్లు ఎక్కువగా ఉంటాయి. మామూలు సమయాల్లో జిల్లాలో రోజుకు 1 నుంచి 2 పాము కాటు కేసులు వస్తే వర్షా కాలం ప్రారంభమైన తరువాత రోజుకు 4 నుంచి 5 కేసుల వరకు వస్తున్నాయి. జిల్లాలో ప్రతి ఏడాది పాముకాట్లు పెరుగుతున్నాయి. అయితే పాము కాటు వలన మరణించేవారి సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గింది. 2022 సంవత్సరంలో జనవరి నుంచి డిసెంబరు వరకు 119 మంది పాముకాటుకు చికిత్స కోసం ఒంగోలు లోని జీజీహెచ్‌కు వచ్చారు. వీరిలో 56 మంది పురుషులు కాగా 63 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 99 మంది అడ్మిట్ అయ్యారు. చికిత్స పొందుతూ ఒకరు మరణించారు. 2023 సంవత్సరంలో జనవరి నుంచి డిసెంబరు వరకు 393 మంది పాముకాటు చికిత్స కోసం వచ్చారు. వీరిలో 240 మంది పురుషులు కాగా 153 మంది మహిళలు ఉన్నారు. ఇందులో 305 మంది అడ్మిట్ అయి చికిత్స తీసుకున్నారు. ఒకరు మరణించారు. ఇక 2024లో జనవరి నుంచి జూన్ వరకు ఈ ఆరు నెలల్లో 100 మంది పాము కాటుకు గురై చికిత్స కోసం వచ్చారు. వీరిలో 63 మంది పురుషులు కాగా 37 మంది మహిళలు ఉన్నారు. ఈ వంద మందిలో కేవలం 87 మంది మాత్రమే చికిత్స కోసం అడ్మిట్ అయ్యారు. ఎలాంటి మరణాలు సంభవించలేదు. గత రెండేళ్లలో పాము కాటు వలన మరణించిన వారిలో కేవలం పురుషులు మాత్రమే ఉండడం గమనార్హం. మరణాలు గణనీయంగా తగ్గడానికి సకాలంలో వైద్యం అందడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు.

**ఇంజక్షన్లు సరిపడా ఉన్నాయి:**

జిల్లాలో పాము కాటుకు వినియోగించే ఇంజక్షన్లు సరిపడా ఉన్నాయి. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ వైద్యశాలలకు అవసరమైన ఔషధాలను తొలి త్రైమాసికంలోనే పంపించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 3642 డోసుల యాంటి స్నేక్ వీనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. స్నేక్ వీనం యాంటి సీరం అనే ఇంజక్షన్లు 229 డోసులు ఉన్నాయి.

**లక్షణాలను ఇలా గుర్తించాలి...**

పాము కాటు వేసిన చోట వాపు, నొప్పి ఉంటుంది. కొంత మందిలో మూత్రంలో రక్తం పోతుంది. అందుకే మూత్రం ఎర్రగా వస్తుంది. కళ్లు మూత పడడం, మింగడానికి ఇబ్బందిగా ఉండడం, శ్వాస ఆడక ఇబ్బంది పడతారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని బట్టి వైద్యం చేస్తామని జీజీహెచ్ జనరల్ ఫిజీషియన్ డా.కళ్యాణి చెప్పారు.

**మూఢనమ్మకాలను నమ్మవద్దు:**

పాముకాటు వేసిన వారు మూడు రోజుల పాటు నిద్ర పోకూడదని గ్రామీణ ప్రాంతాల్లో ఒక నమ్మకం విస్తృతంగా ప్రచారంలో ఉంది. అలాగే ఫలానా వస్తువులు తినకూడదని పత్యాలు పెడుతుంటారు. నిజానికి ఎలాంటి ఆందోళన చెందకుండా నిద్రపోవచ్చు. ఆహారం విషయంలో కూడా ఎలాంటి పత్యాలు లేవు.

### జిల్లాలో 72 పీహెచ్‌సీలు..

ప్రస్తుతం జిల్లాలో మొత్తం 72 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరేసి క్వాలిఫైడ్ వైద్యులను నియమించారు. ప్రతి వైద్యశాలలోనూ అత్యవసర వైద్య సేవలను అందించేందుకు తగిన సిబ్బంది, ఔషధాలను ఏర్పాటు చేశారు. నగర శివారు ప్రజలకు అందుబాటు ఉండేలా 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఒక్క ఒంగోలు నగరంలోని శివారు ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉండేలా 9 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. నామ మాత్రంగా హాస్పిటళ్లను ఏర్పాటు చేసి చేతులు దులుపుకోకుండా ప్రతి యూపీహెచ్‌సీల ఒక ఎంబీబీఎస్ వైద్యుడితో పాటు ఏడుగురు సిబ్బందిని నియమించారు. ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలో పాముకాటు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచారు. దీంతో పాముకాటుకు గురైన వారిని సకాలంలో వైద్య చికిత్స చేసేందుకు అవకాశం ఏర్పడింది.

### విష పాములను గుర్తించడం ఎలా...?

పాము కాటేసిన వెంటనే విషం కంటే పాము కాటేసిందన్న భయమే ఒళ్లంతా పాకేస్తుంది. మానసిక ఆందోళనతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారే ఎక్కువగా ఉంటున్నారని వైద్య నివేదికలు చెబుతున్నాయి. నిజానికి పాములన్నీ విషపూరితమైనవి కావు. ఇందులో కొన్ని పాములు విష పాములు ఉంటే మరికొన్ని విషరహిత పాములుంటాయి. విష పాములకు రెండు కోరలు ఉంటాయి. విషరహిత పాములకు ఎలాంటి కోరలు ఉండవు. అందుకే పాము కాటేసినప్పుడు గాయాన్ని నిశితంగా పరిశీలించాలి. శరీరంపై రెండు గాట్లు దిగినట్లు కనిపిస్తేనే విష సర్పం కాటేసినట్లు గుర్తించాలి. ఒకసారి పాము కాటేసిన పాములో తిరిగి విషం ఉత్పత్తి కావడానికి 24 గంటల నుంచి 48 గంటల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ఎక్కువగా నాగు పాము, కట్ల పాములు ఉన్నాయి. నాగుపాము కాటేసినప్పుడు నొప్పితో విలవిల్లాడిపోతారు. అదే కట్ల పాము కనుక కాటేస్తే చీమ కుట్టినట్టు మాత్రమే ఉంటుంది. దాంతో పాము కాటు వేసినట్లు అనుమానించరు. నిర్లక్ష్యం చేస్తారు. ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుంది.

### సకాలంలో వైద్యశాలకు తరలించాలి



ఎవరికైనా పాము కరిస్తే ఆందోళన చెందకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించాలి. మన ప్రాంతంలో ఎక్కువగా విష సర్పాలు లేవు. ఉన్నా డ్రైడ్ పాములు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ధైర్యంగా ఉండాలి. కాటుకు పై భాగంలో ఎలాంటి కట్లు కట్టాల్సిన అవసరం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం మంచి వైద్యం అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీలైనంత త్వరగా వైద్యశాలకు తరలించి సుశిక్షితులైన వైద్యులచేత చికిత్స చేయించడం మంచిది.

–డాక్టర్ ఎస్.కళ్యాణి, జనరల్ ఫిజీషియన్, హెచ్ఓడీ

### ప్రజల్లో అవగాహన కలిగించాలి




అన్నీ రకాల పాములు విషపాములు కావు. పాము కాట్లన్నీ ప్రమాదం అని అనుకోకూడదు. అలాగని నిర్లక్ష్యం వహించకూడదు. ముందుగా ఎలాంటి పాము కాటు వేసిందో నిర్ధారించాలి. అది విషం కలిగిన పాము అయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి సకాలంలో వైద్యం చేయిస్తే చాలు. జీజీహెచ్‌లో పాము విషం విరుగుడు ఇంజక్షన్లతోపాటుగా తగిన వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

– డాక్టర్ జీ.దుర్గాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్, ఒంగోలు.

# ఈద్ ముబారక్

- భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ నమాజులు
- ఈద్గా మైదానంతోపాటు మస్జిద్‌లలో ఈద్ నమాజ్



ఒంగోలులో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న మత పెద్ద



ఈద్గా వద్ద కళ్లకు సుర్మా పెట్టించుకుంటున్న ముస్లింలు



ఈద్గా వద్ద వజూ చేస్తున్న ముస్లింలు



ఒంగోలు టౌన్: పవిత్రమైన బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఒంగోలు నగరంతోపాటుగా జిల్లాలోని అన్నీ ఈద్గా మైదానాలు ముస్లింలతో కిక్కిరిసి పోయాయి. సంప్రదాయకంగా తెల్లటి లాల్చీ, పైజామాలు, తల మీద టోపి ధరించిన ముస్లింలు అల్లా హు అక్బర్...అంటూ సామూహికంగా ఈద్గా మైదానానికి తరలిరావడంతో ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివెరిసింది. ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డులోని జుబేదా మస్జిద్‌లో తెల్లవారు జామున 6.15 నిమిషాలకు పండుగ బయాన్ మొదలు కావడంతో నగరంలో బక్రీద్ వేడుకలు షురూ అయ్యాయి. మక్కా మస్జిద్, మదీనా మస్జిద్, అన్నవరప్పాడు మస్జిద్, పోలీస్ క్వార్టర్స్ మస్జిద్, బిలాల్ మస్జిద్, రహమత్ మస్జిద్, నిసార్ మస్జిద్, సుఫియా మస్జిద్, గంటపాలెం మస్జిద్, హుసేని మస్జిద్, ఇస్మాయిల్ మస్జిద్, మర్కస్ మస్జిద్, జామియా మస్జిద్, హుదా మస్జిద్‌లలో కూడా ఈద్ నమాజు నిర్వహించారు. చివరిగా ఉదయం 10 గంటలకు గద్దలగుంట వద్ద ఈద్గా మైదానంలో బయాన్ ప్రారంభించి గం.10.30కు ప్రత్యేక వాజిబ్ నమాజ్‌ను ఆచరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన ముస్లింలను ఉద్దేశించి హఫీజ్ మొహమ్మద్ హుసేన్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. బక్రీద్ పండుగ విశిష్టతను, హజరత్ ఇబ్రహీం త్యాగనిరతిని వివరించి చెప్పారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటూ ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పలువురు హిందూ సోదరులు సైతం ఈద్గా మైదానం వద్దకు చేరుకొని ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు ఈద్గా వద్ద భక్తుల కోసం మంచి నీళ్లు, మజ్జిగ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.



ఒంగోలులో ఈద్గా వద్ద టోపీలు కొనుగోలు చేస్తున్న ముస్లింలు



పెద్దదోర్నాల ఈద్గా వద్ద ప్రార్థనల్లో ముస్లింలు



కంభం ఈద్గా మైదానంలో..



పామూరులో ఈద్గావద్ద నమాజు చేస్తున్న ముస్లింలు



ఒంగోలులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## బూచేపల్లి కమలాకర్‌రెడ్డికి ఘన నివాళులు



కమలాకర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: సినీ హీరో, నిర్మాత అయిన బూచేపల్లి కమలాకర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలోని పాటిమీదపాలెం రోడ్డులో కమలాకర్ రెడ్డి పార్కులో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, కమలాకర్ రెడ్డికి తల్లి అయిన బూచేపల్లి వెంకాయమ్మ, సోదరుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులు కమలాకర్‌రెడ్డి స్మారకం వద్ద పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. కమలాకర్‌రెడ్డితో వారికున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, మండల రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, మన్నం శ్రీధర్, బీమన వెంకట్రావు, సూది శ్రీనివాసరావు, కూడలి మాలకొండయ్య, పాటిబండ్ల అశ్వర్థామ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గత రుణాలు రద్దుచేసి పథకాలను పునరుద్ధరించాలి

- దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు

ఒంగోలు: ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ గత రుణాలు రద్దుచేసి, ఆ పథకాలను పునరుద్ధరించాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిద్వారా దళిత నిరుద్యోగుల, చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎటువంటి విపత్తులు లేకుండానే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు రద్దుచేసి, దళిత లబ్ధిదారులకు ఊరట కలిగించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో మంజూరు చేసిన సంబంధిత రుణాలు కడుతూ లబ్ధిదారులు ఎంతో నరకం అనుభవిస్తూ ఉన్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో బీజేపీ కూటమి భాగస్వామ్యంగా ఉన్నందున ముఖ్యమంత్రి కేంద్రాన్ని ఒప్పించి రుణామాఫీ చేసి, ఆపేసిన సంబంధిత రుణాలు పునరుద్ధరించి దళిత లబ్ధిదారుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు.

## జీవన ప్రమాణాల పెంపునకు సీఐటీయూ పోరాటం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకురాలు పి.కల్పన

ఒంగోలు: కార్మికులు, ఉద్యోగుల హక్కులు, జీవన ప్రమాణాల పెంపు కోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని సీఐటీయూ జిల్లా నాయకురాలు పి.కల్పన అన్నారు. సోమవారం కొత్తపట్నం వాణి స్కూల్లో నిర్వహించిన కొత్తపట్నం మండల సీఐటీయూ రెండో మహాసభ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంపదను కార్పొరేటర్లకు ధారాదత్తం చేస్తూ కార్మికుల హక్కులను హరించి వేయడాన్ని విశాలమైన ఐక్య ఉద్యమాలు, పోరాటాల ద్వారా ప్రతిఘటిస్తున్నామన్నారు. హక్కుల కోసం పోరాడుతున్న వారికి సంఘీభావంగా నిలబడుతున్నామని, బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం ద్వారానే కార్మికులను కాపాడుకోగలమని సీఐటీయూ భావిస్తుందన్నారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, సమగ్రశిక్ష ఉద్యోగులు సమరశీలమైన సమ్మె పోరాటాలు నిర్వహించారని, ఆశ, మధ్యాహ్న భోజనం, పంచాయతీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాడి అనేక విజయాలు సాధించడంలో సీఐటీయూ కృషి చేసిందన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎ.పద్మ అధ్యక్షత వహించారు. అనంతరం మండల కార్యదర్శిగా ఎస్.సోమిరెడ్డి, అధ్యక్షులుగా పి.సోమరాజును, 15 మంది కమిటీని ఎన్నుకున్నారు.

## క్లుప్తంగా

### మంత్రి , ఎంపీని కలిసిన జర్నలిస్ట్ సంఘ నాయకులు


మంత్రి డోలాను సన్మానిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

ఒంగోలు సెంట్రల్: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిలను ఏపీయూడబ్ల్యూజే నాయకులు సోమవారం కలిశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు కోనూరి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అలుగుల సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట సురేష్ కుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి కనకయ్య, జిల్లా యూనియన్ నేతలు బి.వెంకటరావు, శ్రీనివాసరావు, శంకర్, జైరామ్ సర్వేశ్వరరావు తదితరులు పాల్గొని కలిసి మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అండగా ఉండాలని కోరారు.

### నారాయణస్వామి ఆదాయం రూ.2.78 లక్షలు


చైర్మన్, ఈఓకు విరాళం చెక్కులను అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రూ.2,78,196 ఆదాయం వచ్చినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,00,830, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ.37,190, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.90,060, మహాప్రాకార నిర్మాణానికి రూ.50,116 అందజేశారన్నారు. మహాప్రాకార నిర్మాణం, అన్నదానానికి హైదరాబాద్‌లోని కాచిగూడకు చెందిన భూతరాజు శ్రావ్య, తండ్రి శ్రీనివాసులు రూ.1,00,232 లక్షల విరాళం ఇచ్చారన్నారు. కొమ్మినేని వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

### బ్రెయిన్ ట్యూమర్ బాధిత చిన్నారికి సహాయం


బాధిత చిన్నారి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న సూర్యశ్రీ ట్రస్ట్ నిర్వాహకులు

ఒంగోలు టౌన్: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న ఒక చిన్నారికి నగరానికి చెందిన సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వారు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. బాపట్ల జిల్లా పెదమట్లపూడి గ్రామానికి చెందిన ఎల్వీ బాలకృష్ణ కూతురు జాహ్నవి కొన్నాళ్ల నుంచి బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. ఆ చిన్నారి వైద్యం కోసం చిరుద్యోగి అయిన బాలకృష్ణ తిరగని హాస్పిటల్ లేదు. ఇప్పటికే ఆయన 30 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. ఎలాగైనా సరే కన్నబిడ్డను కాపాడుకోవాలన్న ఉద్దేశంతో చేతికి అందిన కాడల్లా అప్పులు చేశారు. చివరికి సొంత ఇంటిని సైతం అమ్మేశారు. చేతిలో చిల్లిగవ్వ లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఒంగోలులోని సూర్యశ్రీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులను సంప్రదించి తన బిడ్డ వైద్యం కోసం ఆర్థిక సహాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన సూర్యశ్రీ ట్రస్ట్ నిర్వాహకులు చిన్నారి జాహ్నవిని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ట్రస్ట్ తరఫున ప్రవాస భారతీయుడు శ్రీకాంత్ చౌదరి రూ.25 వేలు, మండవ గీత మిత్రులు రూ.41 వేలు కలిపి మొత్తం రూ.66 వేలను ట్రస్ట్ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ ద్వారా సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ సయ్యద్ షహనాజ్, కార్యదర్శి షేక్ సర్దార్ బాషా, కోసూరి శ్రీదేవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని మహిళకు సఖీలో ఆశ్రయం


మతిస్థిమితంలేని మహిళ

ఒంగోలు టౌన్: మతిస్థిమితం లేని ఒక యువతికి స్థానిక జీజీహెచ్ ప్రాంగణంలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించారు. 20 ఏళ్ల యువతి గత 10 రోజులుగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో తిరుగుతుండటంతో ఆర్టీసీ బస్టాండ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలసుబ్రహ్మణ్యం సఖీ వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ జ్యోతి సుప్రియ దృష్టికి తీసుకెళ్లారు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ కె.మాధురికి తెలిపారు. పీడీ అనుమతితో మతిస్థిమితంలేని యువతిని సిబ్బంది సహకారంతో సోమవారం సఖీకి తరలించి ఆశ్రయం కల్పించారు. యువతి తన వివరాలు చెప్పలేకపోతున్నట్లు సఖీ అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. ఈ రిస్క్యూలో సిబ్బంది సుభాషిణి, దీవెన, పీఎఫ్ఓ గౌతమి పాల్గొన్నారు.

# డెత్ స్పాట్స్..!

- ప్రమాదాలకు నిలయాలుగా మలుపులు
- 6 నెలల్లో 20 మంది మృతి
- డివిజన్‌లో 15 బ్లాక్స్ స్పాట్స్ గుర్తింపు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో పలు రహదారులు, మూలములుపులు ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్నాయి. అనంతపూర్ - విజయవాడ నేషనల్ హైవేమీద తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నేషనల్ హైవే కావడంతో గ్రామాల వద్ద క్రాస్‌రోడ్లు, మూల మలుపులు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు అర్థాంతరంగా చనువు చాలిస్తున్నారు. గిద్దలూరు నుంచి త్రిపురాంతకం వరకు ఉన్న హైవేరోడ్డులో ఈ ఏడాది జనవరి 1 నుంచి జూన్ 10 వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. మితిమీరిన వేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా గిద్దలూరు నుంచి త్రిపురాంతకం వరకూ ఉన్న నేషనల్ హైవేపై ప్రతి వారానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోంది. ఎక్కువగా గిద్దలూరు - దిగువమెట్ట, గిద్దలూరు - బేస్తవారపేట, మార్కాపురం - కంభం, మార్కాపురం - దేవరాజుగట్టు, దేవరాజుగట్టు - కుంట, కుంట నుంచి త్రిపురాంతకం మధ్య ఉన్న నేషనల్ హైవేపై సర్వీసు రోడ్లు సరిగా లేకపోవడంతో టూ వీలర్స్‌పై వచ్చేవారు రోడ్డెక్కే సమయంలో తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు.


మార్కాపురం మండలం కుంట వద్ద ప్రమాదకరమైన మూడురోడ్ల కూడలి

### 6 నెలల్లో 20 మంది ..

ఈ ఏడాది జనవరి 1న బేస్తవారిపేట మండలం చట్టిచర్ల అడ్డరోడ్డు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురిని బొలెరో ఢీకొనటంతో సంఘటనా స్థలంలోనే పాపాయిపల్లికి చెందిన పవన్, శ్రీనివాస్, రాహుల్ మృతి చెందారు.

- జనవరి 3న మార్కాపురం మండలం తిప్పాయిపాలెం వద్ద కారు బైకు ఢీకొని తండ్రీ కొడుకులు మృతిచెందారు.
- జనవరి 10న తర్లుపాడు మండలం సీతానాగులవరం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని జి.శ్రీనివాసులు మృతి
- ఫిబ్రవరి 2న కంభం మండలంలోని జంగంగుంట్ల గ్రామం వద్ద హైవే రోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొని పి.ఏసు అదే వ్యక్తి మృతి.
- ఫిబ్రవరి 3న గిద్దలూరు మండలం దిగువమెట్ట అడవి సమీపంలో అదుపుతప్పి టాటా ఏస్ వాహనం బ్రిడ్జిని ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు.
- ఫిబ్రవరి 20న బేస్తవారిపేట మండలం పూసలపాడు సమీపంలో ఆటో, కారు ఢీకొని ఆటోలో ప్రయాణిస్తున్న బర్లకుంట గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, రాములు, బి. చిన్న వెంకటేశ్వర్లు మృతి చెందారు.


గొబ్బూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

- ఫిబ్రవరి 26న కంభం మండలం జంగంగుంట్ల వద్ద హైవేరోడ్డుపై గుర్తుతెలియని వాహనం ఢీకొని సైదాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర మృతి.
- ఏప్రిల్ 14న రాచర్ల మండలం యడవల్లి క్రాస్ రోడ్డువద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గిద్దలూరు మండలం ఉయ్యాలవాడకు చెందిన ఖాజావలి మృతి.
- ఏప్రిల్ 24న కంభం మండలం ఎర్రబాలెం సమీపంలో ఆటో బోల్తాపడి రావులపల్లి నాగయ్య మృతి. ఈ సంఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి.
- మే 3న గిద్దలూరు ఎంపీడీఓ ఆఫీసు సమీపంలో బైకును జీపు ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చెందారు.
- మే 8న పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని మార్కాపురానికి చెందిన ఓ రామకృష్ణ, సైదయ్య మృతి చెందారు.
- మే 11న మార్కాపురం మండలం కొట్టాలపల్లి వద్ద ట్రాలీ ఆటో బైకును ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.

### ప్రమాదాల నివారణకు చర్యలు..

మార్కాపురం డివిజన్‌లో మొత్తం 15 బ్లాక్ స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. ఇందులో పెద్దారవీడు మండలం కుంట, గొబ్బూరు, త్రిపురాంతకం, మార్కాపురం మండలం కుంట, దరిమడుగు నేషనల్ హైవేపై వై జంక్షన్ తిప్పాయపాలెం, జంగం గుంట్ల, బేస్తవారపేట క్రాస్‌రోడ్స్, గిద్దలూరు, తర్లుపాడు - తాడివారిపల్లి హైవే ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ ఉన్నట్టు గుర్తించారు. ఈ ఏడాది జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు.

కాగా రోడ్డు ప్రమాదాల నివారణపై ఇటు పోలీసులు.. అటు రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారి వాహనాలను ఆపి వారికి జరిమానా విధించడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పోలీసులు తరుచూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. మూలమలుపుల వద్ద బ్లింకింగ్ లైట్లు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేశారు. కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. స్పీడ్ గన్‌తో నేషనల్ హైవేపై రవాణాశాఖాధికారులు తనిఖీలు నిర్వహిస్తూ ఓవర్ స్పీడుతో వెళ్లేవారికి జరిమానా విధిస్తున్నారు.


తరచూ ప్రమాదాలు జరిగే మార్కాపురం మండలంలోని కొట్టాలపల్లి మూలమలుపు



రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఓ నాయక్, ఎంవీఐ

### పరస్పరం దాడి కేసు నమోదు

- ఆరుగురికి గాయాలు


తలపై తీవ్రగాయమైన వ్యక్తి

చినగంజాం (పర్చూరు): పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు దాడి చేసుకున్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈఘటన పర్చూరు మండలంలోని నూతలపాడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముల్లా సుభాని, షేక్ కాలేషావలికి మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో సోమవారం ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగారు. ఈగొడవలో ముల్లా సుభానికి తీవ్రగాయాలు కాగా, అతని తండ్రి ముల్లా పెదబాజీవలి, వల్లభరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ముల్లా బాజీవలి, షేక్‌కాలేషావలి, నూర్‌బాషా మస్తాన్‌వలికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం వీరు చికిత్స కోసం చీరాల ప్రభుత్వ వైద్యశాలలో చేరారు. అక్కడ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా పర్చూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ముల్లా సుభాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముల్లా బాజీవలి, షేక్ కాలేషావలి, ముల్లా సుభాని, షేక్ బాజీవలి, ముల్లా మస్తాన్‌వలి, షేక్ మునీర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం షేక్ కాలేషావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముల్లా సుభాని, ముల్లా పెదబాజీవలి, వల్లభరెడ్డి రాజశేఖర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.


ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు


ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

# నమో.. నారసింహా..

- వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు
- చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి పుట్టమట్టి సేకరించడంతో అంకురార్పణ కార్యక్రమం ముగిసింది. సోమవారం మధ్యాహ్నం బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమం అత్యంత వైభవంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ధవళ వస్త్రాన్ని ధ్వజారోహణం చేశారు.

**భక్తులకు కొడిముద్ద**

ధ్వజారోహణ సందర్భంగా భక్తులకు స్వామివారి ప్రసాదంగా కొడిముద్ద పంపిణీ చేశారు. ఈ కొడిముద్దకు ఒక ప్రత్యేకత ఉంది. కొడిముద్ద తిన్న మహిళలకు సంతానం కలుగుతుందని, అనారోగ్యంగా ఉన్న వారు ఆరోగ్యవంతులవుతారని భక్తుల నమ్మకం. ఈ ఏడాది కూడా కొడిముద్ద కోసం మహిళలు, పురుషులు దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొడిముద్ద తిన్న వారు 10 రోజులు నిష్టగా ఉండాలని వేదపండితులు పేర్కొన్నారు.

**చంద్రప్రభ వాహనంపై స్వామివారు**

ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రికి హంస వాహనంపై స్వామి వారు దర్శనమిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పాముర్తి మాధవరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు, ఉదయగిరి లక్ష్మీ నరసింహాచార్యులు, యాజ్ఞికం ఉదయగిరి వెంకట సుదర్శనాచార్యులు పాల్గొన్నారు.


చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన నరసింహస్వామి


అంకురార్పణలో భాగంగా పుట్టమట్టి సేకరిస్తున్న అర్చకులు


బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా స్వామివారి ఊరేగింపు

# నాణెమైన హాబీ..

- విదేశీ నాణేల సేకరణను హాబీగా మార్చుకున్న హిందీ టీచర్
- సుమారు 25 దేశాలకు చెందిన కరెన్సీ, నాణేల సేకరణ
- విద్యార్థులకు నాణేలు, కరెన్సీ చూపుతూ పాఠ్యాంశాల బోధన

మార్కాపురం టౌన్: విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో వచ్చిన చిన్న ఆలోచనను హాబీగా మార్చుకున్నారు మార్కాపురానికి చెందిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు. దేశ విదేశాలకు చెందిన కరెన్సీని సేకరించి భద్రంగా దాచడమే కాదు, వాటిని పిల్లలకు చూపిస్తూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన ఎస్.వీరోజీరావు ప్రైవేట్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2003లో హిందీ పాఠ్యాంశం ''రూపాయి యొక్క ఆత్మ కథ''ను విద్యార్థులకు బోధించే సమయంలో వచ్చిన ఆలోచనతో నాణేలు, కరెన్సీని సేకరించడం హాబీగా మార్చుకున్నారు. గత కొన్నేళ్లుగా ఇతర ప్రదేశాలకు వెళ్లినపుడు అక్కడ స్థానికంగా లభించే కరెన్సీతోపాటు పురాతనమైన దేశ, విదేశీ నాణేలను, కరెన్సీని ఎక్కువ ధరకు కొనుగోలు చేసి భద్రపరుస్తున్నారు.


దేశ రాజులు, జాతీయ నాయకుల నాణేలు


వివిధ దేశాలకు చెందిన నాణేలు

**అధిక ధర చెల్లించి కరెన్సీ కొనుగోలు**

వీరోజీరావు వద్ద అమెరికా డాలర్, వియత్నాం 2వేలు, 5 వేలు, 50 వేలు, నేపాల్ దేశానికి చెందిన 5, 20, 50, జమైకాకు చెందిన 100, 500 డాలర్లు, బంగ్లాదేశ్- 5 టాకా, సౌదీ అరేబియా 1, 5 రియాల్స్, ఆఫ్ఘనిస్తాన్ 500 ఆఫ్ఘన్స్, భూటాన్ కరెన్సీ భూటానీస్ గ్లుట్రమ్, ఎరిత్రియ కరెన్సీ ఎరిత్రియన్ నక్ఫ ఉన్నాయి.

అలాగే ఆస్ట్రేలియా డాలర్, యూరో 50 సెంట్, సింగపూర్ 50 సెంట్, అమెరికా క్వార్టర్ డాలర్, మాల్వి 10క్వచ, శ్రీలంక 1, 5, వివిధ దేశాలకు చెందిన నాణేలు సేకరించారు. భారత దేశానికి చెందిన రాగితో తయారు చేసిన చిల్లు కాణీ, అణా, పావు అణా, అర్ధ అణా, నయా పైసా, ఇత్తడితో చేసిన అణా, అర్ధ అణా, 2 నయా పైసాలు, 10 పైసలు, 20 పైసలు, 1800 నాటి అర్ధరూపాయి, 1944 నాటి రూపాయి, 1860 నాటి 10, 1989 నాటి 5 రూపాయల నాణేలను భద్రపరిచారు. భారతదేశ రాజులు, నాయకులైన చత్రపతి శివాజీ, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ చిత్రాలు, వివిధ జాతీయ దినోత్సవాలు, ప్రత్యేక సందర్భాల్లో ముద్రించిన నాణేలను సేకరించారు.

**కష్టమైనా సరే సేకరిస్తున్నా**



పాఠశాలలో విద్యార్థులకు బోధించే సమయంలో నాణేలు, కరెన్సీ సేకరించాలనే ఆలోచన వచ్చింది. విద్యార్థులకు వాటిని చూపుతూ పాఠ్యాంశం బోధించడం వల్ల సులువుగా అర్థం చేసుకుంటారు. విద్యార్థులకు కూడా దేశంతో పాటు ఇతర దేశాల కాయిన్లు, కరెన్సీలు చూసిన అనుభూతి కలుగుతుంది.

– ఎస్.వీరోజీరావు, హిందీ టీచర్, మార్కాపురం